# సాక్షి
## అనంతపురం

గురువారం । 22 । ఫిబ్రవరి । 2024






**పట్టు గూళ్లు @ రూ.512**

హిందూపురం మార్కెట్‌లో బుధవారం కిలో బైవోల్టిన్ పట్టుగూళ్లు గరిష్టంగా రూ.512 పలికాయి.



**టమాట కిలో రూ.13**

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

37.4°/ 18.6°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం కొన్ని ప్రాంతాల్లో చలి వాతావరణం కొనసాగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

## న్యూస్‌రీల్

### 'కుబైర్ స్టీల్స్'లో అగ్ని ప్రమాదం

- ఏడుగురు కార్మికులకు స్వల్ప గాయాలు



కుబైర్ స్టీల్స్‌లో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

హిందూపురం అర్బన్: కర్ణాటక సరిహద్దు గొల్లాపురం పారిశ్రామికవాడలోని కుబైర్ స్టీల్స్ కర్మాగారంలో బుధవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కర్మాగారం ఆవరణలో ఉదయం 10 గంటల వేళ మంటలు చెలరేగడంతో ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న ఫైర్ ఆఫీసర్ ప్రభాకర్, సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో అక్కడికి చేరుకుని మంటలను ఆర్పారు. కర్మాగారంలో 300 మంది కార్మికులు పని చేస్తుండగా.. ప్రమాదంలో కృష్ణ, సోలబ్, పంచరత్తన్, ప్రవీణ్ కుమార్, డింపుల్ కుమార్, బిట్టప్ప, త్రిభువన్‌లు గాయపడ్డారు. వారిని వెంటనే గౌరీబిదనూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ మాట్లాడుతూ... తుక్కు ఇనుము ఉన్న ప్రాంతంలో ఖాళీ పెయింట్ డబ్బాలు ఉంచారని, వాటి నుంచే మంటలు వచ్చినట్లు భావిస్తున్నామన్నారు. హిందూపురం రూరల్ సీఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి దారి తీసిన కారణాలపై ఆరా తీశారు.

### హనుమద్వాహనంపై శ్రీవారి విహారం



హనుమద్వాహన సేవలో కొండమీదరాయుడు

బుక్కరాయసముద్రం: బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం కొండమీదరాయుడు హనుమద్వాహనంపై ఊరేగారు. పుర వీధులలో భక్తులకు కనువిందు చేశారు. అంతకుముందు స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గురువారం శ్రీవారిని గరుడ వాహనంపై ఊరేగించనున్నారు.

# తలసరి ఆదాయం అదుర్స్

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక వర్షాలు సమృద్ధిగా కురిశాయి. భూగర్భ జలాలు పెరిగాయి. వ్యవసాయానికి ఢోకా లేకుండా చేశాయి. ఇదే క్రమంలో పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కూడా పథకాలు అమలు చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా డీబీటీ ద్వారా నేరుగా ఫలాలను అందించింది. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగయ్యాయి. తాజాగా వెల్లడించిన తలసరి ఆదాయ లెక్కలు ఈ విషయాన్ని ధ్రువపరుస్తున్నాయి.



చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు సవరం అమరమ్మ. శ్రీ సత్యసాయి జిల్లా, అమడగూరు మండలం, చీకిరేవులపల్లి. ఆదాయాభివృద్ధిని పెంపొందించేందుకు చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వం ఈమెకు రుణాలను మంజూరు చేసింది. వైకేపీ ద్వారా బ్యాంకు లింకేజీ రుణం కింద రూ1.50 లక్షలు, స్త్రీనిధి రుణం కింద రూ. 50 వేలు, జగనన్న తోడు కింద రూ. 10 వేలు మొత్తంగా రూ. 2.10 లక్షలు పొందింది. గ్రామంలో కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకుంది. కుటుంబాన్ని ఇబ్బంది లేకుండా పోషించుకుంటోంది. 2019 ఎన్నికల నాటికి డ్వాక్రా సంఘంలో ఈమె రుణం రూ. 40 వేలు ఉండేది. 'వైఎస్సార్ ఆసరా' పథకం ద్వారా మొత్తం మాఫీ అయిపోయింది. 'వైఎస్సార్ చేయూత' పథకం ద్వారా ఏటా రూ. 18,750 చొప్పున నాలుగేళ్లలో రూ.75 వేలు అమరమ్మ ఖాతాలో జమైంది. 2019కు ముందు జీవనోపాధి కష్టంగా ఉండేదని, ఇప్పుడు ఇంటిల్లిపాదీ సంతోషంగా ఉన్నామని అమరమ్మ తెలిపింది.




- ఉమ్మడి జిల్లాలో భారీగా పెరిగిన తలసరి ఆదాయం
- తాజా సూచీల్లో రూ.1.70 లక్షలుగా నమోదు
- టీడీపీ హయాంతో పోల్చితే గణనీయ మార్పు
- సమృద్ధిగా కురిసిన వర్షాలకు సంక్షేమ ఫలాలు తోడై సత్ఫలితాలు

**ఉమ్మడి జిల్లాలో తలసరి ఆదాయం నమోదు ఇలా**

| సంవత్సరం | తలసరి ఆదాయం |
|---|---|
| 2018-19 | రూ.1,15,538 |
| 2019-20 | రూ.1,28,631 |
| 2020-21 | రూ.1,37,597 |
| 2021-22 | రూ.1,64,187 |
| 2022-23 | రూ.1,76,813 |

**పథకాల వల్లే...**



రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలు విజయవంతంగా అమలు చేసినందుకే పేద కుటుంబాలకు ఆదాయం పెరిగింది. ఆ పెరిగిన ఆదాయాన్నే వారు పెట్టుబడుల రూపంలో మార్చుకున్నారు. ఫలితంగా తలసరి ఆదాయం పెరగడమే కాకుండా స్థూల రాష్ట్ర ఉత్పత్తి (ఎస్‌డీపీ) కూడా పెరిగింది. పథకాల నుంచి వచ్చిన ఆదాయాన్ని పెట్టుబడుల రూపంలో మార్చుకున్న దానివల్ల ఆదాయం పెరిగింది.

– ఎండీ బావయ్య, ఎకనామిక్స్ ప్రొఫెసర్, ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఏ ప్రాంతంలో అయినా అక్కడి ప్రజల పరిస్థితి, జీవన ప్రమాణాలు, స్థితిగతులు, వ్యవసాయ ఉత్పత్తులు తదితర అంశాలన్నీ తలసరి ఆదాయాన్ని సూచిస్తాయి. తలసరి ఆదాయం గణనీయంగా పెరిగిందంటే పరిస్థితులు సానుకూలంగా ఉన్నట్టు లెక్క. తాజాగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో తలసరి ఆదాయం భారీగా నమోదైంది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి. 2014–19 మధ్య కాలంతో పోల్చితే ప్రస్తుత పరిస్థితిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది.

**ప్రభావం చూపిన సంక్షేమ ఫలాలు**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 63 మండలాలున్నాయి. ఇందులో 95 శాతం ప్రజలు వ్యవసాయ రంగం పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యలు చేపట్టాక సమృద్ధిగా వర్షాలు కురిశాయి. పుడమిని చల్లగా మార్చి వ్యవసాయానికి ఢోకా లేకుండా చేశాయి. ఉద్యాన పంటలకు ఊతమిచ్చాయి. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా పంటల ఉత్పాదకత పెరిగింది. ఉమ్మడి జిల్లా నుంచి ఏటా 32 లక్షల టన్నుల ఉద్యాన పంట ఉత్పత్తులు వివిధ రాష్ట్రాలకు, దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇందులో చీనీ, అరటి పంటల దిగుబడులు ఎక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలోనే పేద, మధ్య తరగతి వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు పరిస్థితిలో గణనీయమైన మార్పును తీసుకొచ్చాయి. తలసరి ఆదాయం పెరుగుదలలో విశేష ప్రభావాన్ని చూపించాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో డీబీటీ (డైరెక్ట్ బెనిఫిషియరీ ట్రాన్స్‌ఫర్) ద్వారా రమారమి రూ.34 వేల కోట్లు నేరుగా ఖాతాల్లోకే చేరడం ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు కారణమైంది.

**పారిశ్రామిక ఫలితాలూ భేష్..**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పారిశ్రామికీకరణ వల్ల కూడా మంచి ఫలితాలు వచ్చాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన చేయూతతో పెద్ద సంఖ్యలో ఎంఎస్ఎంఈలు ఏర్పాటయ్యాయి. 2019లో ఈ రంగం ద్వారా తలసరి ఆదాయం రూ.9,843 ఉండగా, 2021–22 సంవత్సరంలో రూ.13,346గా నమోదైంది. జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం ఇవ్వడంతో స్థానికంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించాయి. ఇక.. సేవా రంగంలోనూ భారీగా వృద్ధి రేటు నమోదైంది. 2019లో రూ.21 వేలుగా ఉన్న తలసరి ఆదాయం, 2022లో రూ.27,202గా నమోదు కావడం గమనార్హం.

### 'పీపీఆర్' వ్యాక్సినేషన్ వేగం పెంచాలి

అనంతపురం అగ్రికల్చర్: పీపీఆర్ వ్యాధి నివారణకు చేపడుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమంలో వేగం పెరగాలని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం ఆదేశించారు. బుధవారం ఆయన తన చాంబర్ నుంచి డీడీలు, ఆసుపత్రి ఏడీలు, పశువైద్యులతో వర్చువల్ పద్ధతిలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 27,09,394 గొర్రెలు, మేకలు ఉన్నాయన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మార్చి 10 లోపు వంద శాతం టీకాలు వేయాలన్నారు. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. హెల్త్ కార్డులు అందజేయాలని ఆదేశించారు. ప్రస్తుతం మండలానికి 8 మందితో బృందాలు ఏర్పాటు చేశామన్నారు. రెండు, మూడు రోజులు అక్కడే ఉండి పనిచేయాలని సూచించారు. ప్రమాదకర బర్డ్‌ఫ్లూపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. వ్యాధి వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పెద్ద ఫౌల్ట్రీలు, ఇతరత్రా కోళ్ల పెంపకందారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశామన్నారు. ఇప్పటి వరకు ఎక్కడా బర్డ్‌ఫ్లూ ఛాయలు కనిపించలేదన్నారు. వివిధ రకాల నమూనాలు తీసుకుని ప్రయోగశాలకు పంపామన్నారు. ప్రజలు అపోహలు నమ్మకుండా కోడి మాంసం, గుడ్లు తీసుకోవచ్చని తెలిపారు.

### అరటి తోట దగ్ధం

బుక్కరాయసముద్రం: విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి అరటి తోట దగ్ధమైంది. వివరాలు... బీకేఎస్ మండలం అమ్మవారిపేటకు చెందిన రైతు వెంకటగిరి తనకున్న ఆరు ఎకరాల్లో 5వేల అరటి చెట్లను సాగు చేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం ఎండ వేడిమికి విద్యుత్ తీగలు ఒకదానికి ఒకటి తగులుకోవడంతో నిప్పురవ్వలు ఎగిసి పడి తోటలో పడ్డాయి. ఎండిన చెత్తపై నిప్పు రవ్వలు పడడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. డ్రిప్పు పరికరాలతో పాటు పీవీసీ పైపులు, అరటి చెట్లు పూర్తిగా కాలిపోయాయి. దాదాపు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. మండల జెడ్పీటీసీ భాస్కర్, చెదుల్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, ఎస్టీ సెల్ మండల కన్వీనర్ సాకే లక్ష్మీనారాయణ బాధితుడిని పరామర్శించారు.

## ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- పక్కాగా దరఖాస్తుల పరిశీలన
- కలెక్టర్ గౌతమి
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డితో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. ఓట్ల తొలగింపు దరఖాస్తులకు (ఫారం–7) సంబంధించి డెత్, డూప్లికెట్ల పరిశీలన పక్కాగా నిర్వహిస్తున్నామన్నారు. 7 అంశాలతో పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియ చేపట్టామన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితాను సిద్ధం చేయాలని సంబంధిత రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ), ఏఆర్‌ఓ, ఎస్‌డీపీఓ, సీఐలను ఆదేశించామన్నారు.

**2.30 లక్షల ఎపిక్ కార్డులు**

జిల్లాకు ఈనెల 27వ తేదీలోగా 2.30 లక్షల ఎపిక్ కార్డులు రానున్నాయని కలెక్టర్ గౌతమి చెప్పారు. వాటిని పోస్టల్ ద్వారా ఓటర్లకు పంపిస్తామన్నారు. దివ్యాంగులు, 80 ఏళ్ల దాటిన వారు ఇంటి నుంచే (హోమ్ ఓటింగ్) ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. ఈ ఓటర్లు ఎంత మంది ఉన్నారనేది బీఎల్‌ఓలు గుర్తిస్తున్నారని చెప్పారు. పోలింగ్ కేంద్రంలో 1,500 ఓట్లకు మించి ఉన్న చోట అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పనిసరిగా అమలు చేస్తామన్నారు. సమావేశంలో కో–ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్ రవికుమార్, ఎస్‌ఏ శామ్యూల్ బెంజిమన్, పలు పార్టీల ప్రతినిధులు కేవీ రమణ, శ్రీనివాసులు ఈశ్వర్ ప్రసాద్, ప్రవన్‌కుమార్, ఇమామ్, బాలరంగయ్య, మసూద్‌వలి, తదితరులున్నారు.

## యువశక్తి దేశంగా భారత్

- ఎస్కేయూ వీసీ డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి




మాట్లాడుతున్న హుస్సేన్‌రెడ్డి (చిత్రంలో) సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ వీసీ డాక్టర్ ఎస్‌ఏ కోరి

అనంతపురం: యువశక్తి దేశంగా భారత్ విరాజిల్లుతోందని ఎస్కేయూ వీసీ డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి అన్నారు. ఎస్కేయూ ఫార్మసీ కళాశాలలో 'యువ సంవాద్ – ఇండియా' కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ వీసీ డాక్టర్ ఎస్‌ఏ కోరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్కేయూ వీసీ మాట్లాడుతూ.. ప్రపంచంలోని ఏ దేశానికి లేని మానవ వనరులు భారతదేశానికి మాత్రమే ఉన్నాయన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి వందేళ్లు పూర్తి కానున్నాయని,ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగ ఫలంతో సిద్ధించిన స్వేచ్ఛ, సమానత్వ భావాలను పునాదిగా చేసుకుని అగ్రరాజ్యంగా భారత్ ఖ్యాతి దక్కించుకోవాలని ఆకాంక్షించారు. ఇది నెరవేరాలంటే కేవలం యువతతోనే సాధ్యమవుతుందన్నారు. డాక్టర్ ఎస్‌ఏ కోరి మాట్లాడుతూ.. నవభారత నిర్మాణానికి రూపశిల్పులు విద్యార్థులేనన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విశేషమైన ప్రగతి సాధించి నవ్య సమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ గరికపాటి గురజాడ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.మురళీధర్ రావు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రామచంద్ర, సదస్సు కన్వీనర్ డాక్టర్ కె.వరలక్ష్మి దేవి తదితరులు పాల్గొన్నారు.

# చీనీ మార్కెట్ దూకుడు

- దేశంలోని ఇతర మార్కెట్లతో పోటీ పడుతున్న అనంత చీనీ మార్కెట్
- ఈసారి రూ.175 కోట్ల విలువైన 90 వేల టన్నుల అమ్మకం
- మార్చితో ముగియనున్న ఈ సీజన్ చీనీ క్రయ విక్రయాలు



మార్కెట్‌యార్డులో చీనీ క్రయ విక్రయాలు (ఫైల్)

అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులోని చీనీ మార్కెట్ దూకుడుగా సాగుతోంది. ఏటా క్రయవిక్రయాలు భారీగా పెరుగుతున్నాయి. దేశ వ్యాప్తంగా ఢిల్లీలోని ఆజాద్‌పూర్ మండీ, చెన్నైలోని కోయంబేడ్, హైదరాబాద్‌లోని గడ్డిఅన్నారం, నాగపూర్, బెంగళూరులో చీనీ మార్కెట్లతో అనంతపురం మార్కెట్ పోటీ పడుతోంది. మరీ ముఖ్యంగా ఏడాది పొడవునా ఈ–నామ్ విధానంలో పని చేస్తుండటంతో చిన్న, సన్నకారు రైతుల పాలిట వరంగా మారింది. 2022 వరకు ఫిబ్రవరి నుంచి అక్టోబర్ వరకు చీనీ మార్కెట్ సాగింది. ప్రస్తుత మార్కెట్ కమిటీ చైర్మన్ ఏకే ఎస్ ఫయాజ్ ఆధ్వర్యంలో తొలిసారిగా గతేడాది నుంచి ఏడాది పొడవునా మార్కెట్ నిర్వహిస్తున్నారు. సూట్లు, కమీషన్లపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సర్కారు క్రిమినల్ చర్యలకు ఆదేశించడంతో మార్కెటింగ్ ఫీజు మినహా రైతులపై ఎలాంటి భారం పడకుండా చర్యలు చేపట్టినట్లు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు.

**45 వేల హెక్టార్లలో చీనీ**

ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాల పరిధిలో పండుతున్న చీనీకి దేశీయంగా మంచి డిమాండ్ ఉంది. అనంతపురం మార్కెట్ నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు పెద్ద ఎత్తున చీనీ ఎగుమతి అవుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో 45 వేల హెక్టార్ల వరకు చీనీ తోటలు విస్తరించాయి. కాపునకు వచ్చిన తోటలు 36 వేల హెక్టార్ల వరకు ఉండగా.. ఏటా 5 లక్షల మెట్రిక్ టన్నుల మేర చీనీ ఫలసాయం లభిస్తోంది. ఇక్కడ పండుతున్న చీనీలో 60 శాతం వరకు రాజస్తాన్, గుజరాత్, హర్యానా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాలతో పాటు హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు చెందిన వ్యాపారులు కొందరు నేరుగానూ, మరికొందరు ఏజెంట్ల ద్వారా కొనుగోలు చేస్తుంటారు. అయితే చిన్న, సన్నకారు రైతులతో పాటు మధ్య మధ్యలో వచ్చే అరకొర పంటను, అలాగే గ్రేడ్–బీ రకం కొనడానికి వ్యాపారులు అనాసక్తి చూపిస్తుంటారు. అలాంటి వారికి అనంతపురం మార్కెట్‌యార్డు చాలా ఉపయోగపడుతోందని చెబుతున్నారు. ఇక్కడ గ్రేడ్–ఏతో పాటు గ్రేడ్–బీ, గ్రేడ్–సీ సరుకు అమ్మకాలు జరుగుతున్నందున రైతులకు సమస్య లేకుండా పోయింది.

**90 వేల మెట్రిక్ టన్నులు అమ్మకాలు..**

ఈ ఏడాది 89 వేల మెట్రిక్ టన్నులు చీనీ క్రయ విక్రయాలు జరిగాయి. ఏప్రిల్ నుంచి జూన్ అలాగే అక్టోబర్, నవంబర్‌లో మంచి ధరలు పలకడంతో రూ.175 కోట్ల వరకు టర్నోవర్ జరిగినట్లు అంచనా వేశారు. ఇంకా ఫిబ్రవరి, మార్చి ఉన్నందున చీనీ అమ్మకాలు, క్రయ విక్రయాలు పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇపుడిపుడే అమ్మకాలు మొదలయ్యాయి. దీని వల్ల ఫీజు రూపంలో మార్కెట్ కమిటీకి మంచి ఆదాయం లభించింది. ఈ ఏడాది మార్కెట్‌లో టన్ను గరిష్ట ధరలు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు పలకడంతో రైతులకు కూడా గిట్టుబాటు అయినట్లు చెబుతున్నారు.

**అనంతపురం మార్కెట్‌యార్డులో చీనీ అమ్మకాలు ఇలా**

| సంవత్సరం | చీనీకాయలు (టన్నుల్లో) | అమ్మకాల విలువ (రూ.కోట్లలో) |
|---|---|---|
| 2016-17 | 23,408 | 48.80 |
| 2017-18 | 59,585 | 84.32 |
| 2018-19 | 38,395 | 71.68 |
| 2019-20 | 44,830 | 74.57 |
| 2020-21 | 53,820 | 95.22 |
| 2021-22 | 57,192 | 128.30 |
| 2022-23 | 94,460 | 189.85 |
| 2023-24 | 89,039 | 175.25 |

**ఏటా ఇక్కడే అమ్మకాలు**



అనంతపురం మార్కెట్ యార్డులోని చీనీ మార్కెట్ మాలాంటి రైతులకు బాగా ఉపయోగపడుతోంది. నా తోటలో 750 చీనీ చెట్లు ఉండగా ఏటా 30 టన్నులకు పైగా దిగుబడి చేతికి వస్తోంది. కొన్నేళ్లుగా ఈ మార్కెట్‌లోనే చీనీకాయలు అమ్ముకుంటున్నా. ఇక్కడ కమీషన్లు, సూట్లు తీసుకోవడం లేదు. బయట మార్కెట్‌లో ఉన్న ధర ఇక్కడ కూడా పలికితే రైతులకు మరింత లాభదాయకంగా ఉంటుంది.

– జి.సుబ్బయ్య, చీనీ రైతు, ముకుందాపురం

**రైతులకు చాలా మేలు**



అందుబాటులో మార్కెట్ ఉండటం వల్ల మా లాంటి చిన్న,సన్నకారు చీనీ రైతులకు చాలా మేలు జరుగుతోంది. లేదంటే వ్యాపారులు, దళారులు చెప్పినట్లుగా అమ్ముకునే పరిస్థితి ఉండేది. అందుకు కమీషన్లు, సూట్లు రూపంలో రైతులకు నష్టం జరిగేది. ఇక్కడ అలాంటి సమస్య లేనందున సాఫీగా చీనీ కాయలు అమ్ముకుంటున్నాం. కొంచెం ధరలు పెంచితే ఈ చీనీ మార్కెట్‌కు ఇక తిరుగుండదు.

– నల్లప్ప, చీనీ రైతు, ముకుందాపురం

**మార్కెట్ విస్తరణకు చర్యలు**



రైతులకు మరిన్ని సదుపాయాలు కల్పించడానికి వీలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహం, స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సహకారంతో చీనీ మార్కెట్‌ను విస్తరిస్తున్నాం. వేసవిలో పండ్లు దెబ్బతినకుండా, గాలీవానకు ఇబ్బంది పడకుండా ఇప్పుడున్న ఓపెన్‌షెడ్‌కు అదనంగా రూ.3 కోట్ల వరకు ఆధునిక పద్ధతిలో మరో ఓపెన్‌షెడ్డు నిర్మిస్తున్నాం. తాగునీరు, ఇతరత్రా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ఈ ఏడాది లక్ష టన్నులకు పైగా క్రయ విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. మంచి ధరలు పలికేలా వ్యాపారుల్లో పోటీతత్వం తీసుకువస్తాం.

– ఏకేఎస్ ఫయాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్, అనంతపురం

## వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న డీఈఓ వరలక్ష్మి

గార్లదిన్నె: పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా పనిచేయాలని ఉపాధ్యాయులకు డీఈఓ వరలక్ష్మి సూచించారు. బుధవారం గార్లదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, పీడబ్ల్యూఎస్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. జెడ్పీహెచ్ఎస్‌లో రికార్డులో కంటే ఎక్కువగా బియ్యం నిల్వ ఉండడం గమనించి హెచ్ఎంను ప్రశ్నించారు. మూడు రోజుల్లో నివేదిక పంపాలని ఆదేశించారు. కట్టెల పొయ్యి మీద కాకుండా గ్యాస్ మీద వంట చేయాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అనంతరం ప్రైమరీ పాఠశాలలో రెండవ తరగతి విద్యార్థులతో పుస్తకాలు చదివించారు. కిచెన్ షెడ్డు, వంట తయారీ చాలా బాగుందని కితాబునిచ్చారు. మోడల్ స్కూల్‌లో కిచెన్ షెడ్డు బాగా లేకపోవడం, కట్టెల పొయ్యి మీద వంట చేస్తుండడాన్ని గమనించి వెంటనే వంట చేసే స్థలాన్ని మార్చాలన్నారు. గ్యాస్ మీద వంట చేసేలా చొరవ తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు.

## క్లుప్తంగా

### ఎస్కేయూ 'ఇంజినీరింగ్'కు హుందాయ్ దన్ను



హుందాయ్ కంపెనీ ప్రతినిధిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర

**అనంతపురం:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలకు హుందాయ్ కంపెనీ దన్నుగా నిలిచింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద రూ.33 లక్షలు విలువ చేసే 16 ఇంటరాక్టివ్ ప్యానళ్లు, 10 కంప్యూటర్లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్కేయూ వీసీ డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డిని హుందాయ్ మోబీస్ కంపెనీ ప్రతినిధులు ఎం.డి.యాంగ్ యెన్గ్ డియుక్, హెచ్ఆర్‌జీఏ కో–ఆర్డినేటర్ హుమిన్‌హో, పీఎస్ శ్రీనివాస్ తదితరులు కలిసి మాట్లాడారు. కళాశాల, కంపెనీకి మధ్య అంతరం తగ్గేలా నూతన సిలబస్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు ఎస్కేయూ వీసీ తెలిపారు. కంపెనీ అవసరాలకు దోహదపడేలా విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కల్పించేందుకు సమ్మతించిన హుందాయ్ కంపెనీ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఎండీ యాంగ్ యెన్గ్ డియుక్ మాట్లాడుతూ.. ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాల ఓ ఉత్తమమైన కళాశాలగా తాము గుర్తించామని, ఈ నేపథ్యంలో స్పాన్సర్‌షిప్ ఇచ్చేందుకు ముందుకు వచ్చామన్నారు. భవిష్యత్తులో మరింత సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కళాశాల విద్యాభివృద్ధికి దోహదపడేలా పరికరాలను అందజేసిన హుందాయ్ కంపెనీ ప్రతినిధులకు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ధన్యవాదాలు తెలిపారు.

### విద్యుదాఘాతంతో వివాహిత మృతి

**రామగిరి:** విద్యుత్ షాక్‌కు గురై ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... రామగిరి మండలం పేరూరు సమీపంలోని పెదయ్యగారికొట్టాలకు చెందిన రమాదేవి (36), అక్కులప్ప దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. వ్యవసాయ పనులతో జీవనం సాగించేవారు. బుధవారం ఉదయం ఇంటి వద్ద బాత్‌రూమ్‌కు వెళ్లిన రమాదేవి... అక్కడ తెగిపడిన విద్యుత్ వైర్లను గమనించక కాలు పెట్టింది. దీంతో షాక్‌కు గురైన ఆమె గట్టిగా కేక వేస్తూ కుప్పకూలింది. అప్రమత్తమైన చుట్టుపక్కల వారు అక్కడకెళ్లి గమనించేలోపు ప్రాణాలు కోల్పోయింది. విషయం తెలుసుకున్న రామగిరి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.



# అచ్చం.. అలాగే!

ఒకే పోలిక.. ఒకే డ్రెస్. ఒకరిని చూస్తే మరొకరిని చూసినట్లే! జిరాక్స్ టూ జిరాక్స్... ఇలా చెప్పుకుంటూ పోతే కవలల గురించి ఎన్నో అంశాల్ని పోల్చి చెప్పినా తక్కువే అవుతుంది. తల్లిగర్భంలో ఒకేసారి, ఒకే రూపంతో మొదలై క్షణాల వ్యవధిలోనే బయటి ప్రపంచానికి పరిచయమై ఒకే ముఖకవళికలతో అందరినీ అమితంగా ఆకట్టుకోవడం కవలల ప్రత్యేకత. ముద్దులొలికే పసికందులను చూడగానే వారి పేర్లను కూడా దరిదాపు ఒకేలా పెట్టేయడం పరిపాటిగా మారింది. రామయ్య.. లక్ష్మయ్య, రమేష్.. నరేష్, జలజ.. శైలజ... లాంటి పేర్లతోనూ తికమక పట్టించేస్తుంటారు. అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' ప్రత్యేక కథనం.

## సందర్భం

### నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం

- ఒకే పోలికతో తికమక పెట్టిన సందర్భాలు అనేకం
- అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్న కవలలు
- ఫలదీకరణలో మార్పుల కారణంగానే కవలల జననం

**అనంతపురం కల్చరల్/యల్లనూరు/గుత్తి రూరల్/పుట్లూరు:** సృష్టి లోని ఎన్నో వింతలు, అద్భుతాల్లో కవలల జననం కూడా ఒకటిగా ఉంటోంది. బాగా తెలిసిన వారు సైతం కవలలను ఎవరెవరో పోల్చుకోవడం కాస్త ఇబ్బందిగానే ఉంటుంది. ఫలదీకరణలో వచ్చే మార్పుల కారణంగా కవలల జననం సంభవిస్తుందని వైద్యనిపుణులు అంటున్నారు. అందరినీ ఆకర్షించే కవలల ప్రాశస్త్యం తెలిపేలా గురువారం అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని ఆసక్తికరంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

**కవలల దినోత్సవ ఆవిర్భావమిలా...**

ప్రథమంగా కవలల దినోత్సవాన్ని పోలెండు దేశస్థులు 1976లో నిర్వహించారు. మోజెస్, విల్‌కాక్స్ అనే కవల సోదరులు తాము నివసిస్తున్న ఊరికి 'ట్విన్స్ బర్గ్' అని పేరుపెట్టుకున్నారు. కవలలనే పెండ్లాడి, మళ్లీ కవలలకే జన్మనిచ్చారు. దురదృష్టమైన విషయమేమంటే ఒకే రకమైన వ్యాధి సోకి వారిద్దరూ ఒకే రోజు మరణించారు. వీరి గుర్తుగా ప్రతి ఫిబ్రవరి 22న అంతర్జాతీయ కవలల దినం జరపడం పరిపాటిగా మారింది.

### ఇద్దరిదీ ఒకే మనస్తత్వం



సందీప్, సంతోష్... అనంతపురంలోని బీఎస్ఎన్ఎల్ సంస్థలో పనిచేస్తున్న చిదానందమూర్తి, నిర్మల దంపతుల కుమారులైన వీరి ఇద్దరి రూపాల్లో కాసింత తేడా ఉన్నా ఒకే మనస్తత్వంతో మనుగడ సాగిస్తున్నారు. ఒలింపియాడ్‌లో ఇద్దరూ గోల్డ్‌మెడల్ సాధించారు.

### చదువులో ఒకరు... ఆటల్లో మరొకరు



ఎప్పుడూ చురుగ్గా ఉండే అజ్మల్, అక్మల్ అనంతపురంలోని శ్రీనివాస నగర్‌లో నివాసముంటున్నారు. మెహబూబా, అబ్దుల్ సమీ సంతానమైన వీరిద్దరూ ఓ ప్రైవేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నారు. పోలికలు వేర్వేరుగా ఉండడంతో కనుక్కోవడం పెద్ద కష్టం కాదని అంటారు. చదువు విషయంలో ఒకరు, క్రీడల్లో మరొకరు ఆసక్తి రాణిస్తున్నారు.

### అన్ని పనులూ కలిసే..



యల్లనూరు మండలం పెద్దమల్లేపల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డి, శశికళ దంపతుల కుమారులు యశ్వంత్‌రెడ్డి, యతీంద్రరెడ్డి స్థానిక శారదా విద్యామందిర్‌లో 8వ తరగతి చదువుతున్నారు. ఏ పని చేసినా ఇద్దరూ కలిసే చేస్తుంటారు. వ్యవసాయంలోనూ తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటూ తమ చేతనైన పనులు చేస్తుంటారు.

### తల్లిదండ్రులే తికమకపడతారు



తాడిపత్రికి చెందిన షేక్‌నాజియా, షేక్ బాబా ఫక్రుద్దీన్ దంపతుల కుమార్తెలు మన్నత్ అఫ్రా, మన్నత్ అష్మిరా ఇద్దరూ ఒకే పోలికతో ఉంటారు. ఏ వస్తువు కొన్నా ఇద్దరికీ ఒకే డిజైన్‌తో ఉన్నవే కొనాలి. లేదంటే గొడవ చేస్తారు. ఒకరికి జ్వరం వస్తే వెంటనే మరొకరు జబ్బు బారిన పడతారు. ఏ పనైనా ఇద్దరూ ఒకేలా చేస్తుండడంతో ఎవరు ఎవరనేది తల్లిదండ్రులే పోల్చుకోలేక తికమకపడుతుంటారు.

### గుర్తించడం కష్టమే



పుట్లూరు మండలం పి.చింతలపల్లి గ్రామానికి చెందిన మూలి ఉత్తమరెడ్డి, గౌతమి దంపతుల కుమారులు విజయకృష్ణ, విజయ మోహన్ ఒకే పోలికతో ఉంటారు. ఇద్దరూ ఒకేలా దుస్తులు వేసుకున్న సమయంలో ఎవరు ఎవరనే విషయం గుర్తించడం కష్టమే. ప్రస్తుతం ఇద్దరూ ఒకటో తరగతి చదువుతున్నారు.

### ఒకరంటే మరొకరికి ప్రాణం



అనంతపురం నగరానికి చెందిన జిలాన్‌బాషా, ఫక్రున్నీసా దంపతుల కుమార్తెలు బుష్రా, జిక్రా ప్రస్తుతం 1వ తరగతి చదువుతున్నారు. చూసేందుకు ఒకేలా ఉన్న వీరిద్దరూ పాఠశాలలోనే కాకుండా చాలా ప్రాంతాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. ఒకరంటే మరొకరికి ప్రాణం. ఒకే రకంగా ఆలోచిస్తుంటారు.

### గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య



**తాడిపత్రి:** మండలంలోని చల్లవారిపల్లి – తాడిపత్రి రైల్వే స్టేషన్ల మధ్య బుధవారం రాత్రి గుర్తుతెలియని యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్‌పీ ఎస్ఐ నాగప్ప తెలిపిన మేరకు... మృతుడికి 20 నుంచి 22 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుంది. ముదురు ఆకుపచ్చ చొక్కా, నల్లటి ప్యాంట్ ధరించి ఉన్నాడు. కుడి చేతిపై చిన్నా అని పచ్చబొట్టు ఉంది. ఇంతకు మించి మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ఆచూకీ తెలిసిన వారు తాడిపత్రి రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ నాగప్ప కోరారు.

### ఆటోను ఢీ కొన్న బస్సు

- 11 మందికి గాయాలు

**గుత్తి:** పెళ్లి బృందం వెళుతున్న ఆటోను బస్సు ఢీకొన్న ఘటనలో 11 మంది గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి, కొత్తపల్లికి చెందిన 11 మంది బుధవారం ఉదయం బస్సులో గుత్తి బస్టాండుకు చేరుకున్నారు. అనంతరం పెద్దవడుగూరు మండలం ఆవులాంపల్లిలో జరిగే పెళ్లి వేడుకకు హాజరయ్యేందుకు ఆటోలో బయలుదేరారు. గుత్తి పట్టణంలోనే అనంతపురం మార్గంలో ప్రయాణిస్తుండగా మడకశిర నుంచి కర్నూలుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఘటనలో ఆటో ప్రయాణిస్తున్న 11 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన చరణ్, లక్ష్మీదేవి, జయమ్మకు ప్రథమ చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై సీఐ వెంకటరామిరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### 26న కాంగ్రెస్ సభ

**అనంతపురం టవర్‌క్లాక్:** ఈ నెల 26న అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. బుధవారం డీసీసీ చైర్మన్ బండ్లపల్లి ప్రతాపరెడ్డి, దాదాగాంధీ తదితరులతో కలిసి బహిరంగా సభ ఏర్పాటు స్థలాన్ని ఆయన పరిశీలించి, మాట్లాడారు. సభకు ముఖ్యఅతిథులుగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల తదితరులు హాజరు కానున్నారని తెలిపారు.

### విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి

**యల్లనూరు:** చిత్రావతి నదిలో ఇసుక గుంతల్లో రాత్రిపూట చేపలు పట్టేందుకు వెళ్లి విద్యుత్ తీగలు తగిలి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన లక్షుంపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు..తాడిమర్రి మండలం నాయనపల్లి గ్రామానికి చెందిన మాబు కుమారుడు ఉదయగిరి బాషా(36) బుధవారం రాత్రి చేపలు పట్టేందుకు చిత్రావతి నదిలోకి వెళ్లాడు. విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.



మృతుడు ఉదయగిరి బాషా

### హనుమద్ వాహనంపై రంగనాథుడు

**గుత్తి రూరల్:** తొండపాడు బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు హనుమద్ వాహన సేవలు నిర్వహించారు. బుధవారం రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన శ్రీదేవి, భూదేవి సమేతంగా రంగనాథస్వామి ఉత్సవ విగ్రహాలను హనుమంతుడి భుజస్కంధాలపై అధిష్టింపజేసి పురవీధుల్లో మీదుగా జమ్మి చెట్టు వరకూ ఊరేగించారు. ప్రత్యేక పూజల అనంతరం తిరిగి ఆలయానికి చేర్చారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచే ఆలయంలో ప్రధాన అర్చకులు పలుకూరి రవికుమార్, లిఖిల్ వర్మ, చేతన్ వర్మ, ఉదయ్‌కుమార్, నవీన్‌కుమార్ నేతృత్వంలో విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా ఏర్పాట్లను ఈఓ దేవదాసు, సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ నబీరసూల్, సిబ్బంది పర్యవేక్షించారు.



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు



# పెళ్లిపందిరి తీయకముందే..

- రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ వెంకటరమణ, అల్లుడు మృతి
- కూతురికి తీవ్ర గాయాలు
- పెళ్లింట విషాదం



ఎస్ఐ వెంకటరమణ(ఫైల్)



ఎస్ఐ వెంకటరమణ ఇంటి ఎదుట వేసిన పెళ్లి పందిరి



చెట్టును ఢీకొని నుజ్జు నుజ్జు అయిన కారు

**అనంతపురం:** సరిగ్గా వారం కిందట ఆ ఇంట పెళ్లి వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. పందిరి ఇంకా తీయనేలేదు. అంతలోనే విషాదం నెలకొంది. రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ వెంకటరమణ, ఆయన అల్లుడు మృతిచెందగా..కుమార్తె తీవ్రంగా గాయపడడం కుటుంబ సభ్యులు, బంధువులను విషాదంలోకి నెట్టింది.

**వారం రోజుల క్రితం వివాహం**

అనంతపురం నగరానికి చెందిన నంబూరి వెంకటరమణ (55) పోలీసు శాఖలో 1989 సంవత్సరంలో కానిస్టేబుల్‌గా విధుల్లోకి చేరారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. అంచెలంచెలుగా ఎదిగి మూడేళ్ల క్రితం పదోన్నతిపై కర్నూలు జిల్లా నందికొట్కూరు ఎస్ఐగా వెళ్లారు. అక్కడి నుంచి ఇటీవల ప్యాపిలి సర్కిల్ పరిధిలోని రాచర్ల ఎస్ఐగా బదిలీ అయ్యారు. గత బుధ, గురు వారాల్లో తన ఒక్కగానొక్క కుమార్తె అనూషకు హైదరాబాద్‌కు చెందిన పవన్ సాయితో అనంతపురంలో అంగరంగ వైభవంగా వివాహం జరిపించారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులతో కలసి హైదరాబాద్‌కు వెళ్లారు. బుధవారం కారులో హైదరాబాద్ నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అన్నాసాగర్ వద్ద 44వ జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎస్ఐ వెంకటరమణతో పాటు అల్లుడు పవన్ సాయి (25), డ్రైవర్ చంద్ర (27) అక్కడికక్కడే మృతి చెందారు. కుమార్తె అనూష తీవ్రంగా గాయపడింది. వెంకటరమణ సతీమణి వాణి మరో కారులో ప్రయాణిస్తుండడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు.

**కళ్ల ముందే భర్త, తండ్రి మృతి**

అనూష కళ్ల ముందే తండ్రి వెంకటరమణ, భర్త పవన్‌సాయి దుర్మరణం చెందడంతో ఆమె షాక్‌కు గురైంది. విగత జీవులుగా మారిన తండ్రి, భర్తను చూసి వెనుక కారులో వస్తున్న తల్లికి సమాచారం అందించి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది.

**పెళ్లి ఇంట తీవ్ర విషాదం**

పెళ్లి అయి బంధువులు ఇంకా ఇంటికి చేరుకోకముందే మరణ వార్త వినాల్సి వచ్చింది. భర్త, అల్లుడు మృతి చెందడం, కూతురు తీవ్రగాయాలతో ఆసుపత్రి పాలవడంతో వెంకటరమణ భార్య వాణిని ఓదార్చడం ఎవరి తరమూ కావడం లేదు. ఎంత పనిచేశావు దేవుడా అంటూ గట్టిగా ఏడ్వడం చూసి పలువురు కన్నీటి పర్యంతం అయ్యారు. ఎస్ఐ వెంకటరమణ అన్నదమ్ములు ముగ్గురు కాగా, గతంలో ఇద్దరు అకాల మరణం చెందారు. దీంతో మూడు కుటుంబాలకు వెంకట రమణే పెద్ద దిక్కుగా ఉండేవారు. ఇప్పుడు ఆయన కూడా అకాల మరణం చెందడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి.

# కల్యాణం... కమనీయం

**కదిరి టౌన్:** అయోధ్య సీతారాముల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి రాములోరి కల్యాణం తిలకించి తరించారు. ఇందుకు కదిరిలోని బాలుర కళాశాల ప్రాంగణం వేదికైంది. కదిరి సేవాభారతి ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన అర్చక బృందం బుధవారం రాత్రి శాస్త్రోక్తంగా మేళ తాళాల మధ్య సంప్రదాయబద్ధంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తుల 'జై శ్రీరామ్' నినాదంతో సభా ప్రాంగణం ప్రతిధ్వనించింది. తిరుపతికి చెందిన గాయకులు అన్నమాచార్య కీర్తనలతో అలరించారు. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. 'అయోధ్య సీతారాములు, కల్యాణోత్సవ విశిష్టతను చక్కగా వివరించారు. అనంతరం చాగంటిని, టీటీడీ ఈఓ ధర్మారెడ్డిని ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డితో పాటు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమగట్టు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్, సేవా భారతి అధ్యక్షుడు చెన్నరాయశెట్టి, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



చాగంటిని సన్మానిస్తున్న దృశ్యం



సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



హాజరైన భక్తులు

## క్లుప్తంగా

### చెన్నేకొత్తపల్లి ఎస్ఐగా వెంకటేశ్వర్లు



**కనగానపల్లి(చెన్నేకొత్తపల్లి):** చెన్నేకొత్తపల్లి ఎస్ఐగా పి.వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జరుగుతున్న బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ శ్రీధర్‌ను బదిలీ చేశారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ పి.వెంకటేశ్వర్లుకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి సాదరంగా స్వాగతం పలికారు.

### వైద్య ఖర్చులకు ఆర్థికసాయం



విరాళం అందజేస్తున్న బోధనేతర ఉద్యోగులు

**అనంతపురం:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని గోదావరి హాస్టల్‌లో మినిమం స్కేలు ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న విజయ్ కుమార్ గత ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న తోటి ఉద్యోగులు వెన్నుదన్నుగా నిలిచారు. తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి రూ.20 వేలు, ఇటుకలపల్లి సర్పంచ్ భాస్కర్ రెడ్డి రూ.5 వేలు, తోటి ఉద్యోగులు అందరూ కలిసి రూ.54 వేలు ఆర్థిక సాయాన్ని విజయ్ కుమార్ భార్యకు అందజేశారు. కార్యక్రమంలో బోధనేతర సంఘం ఎస్కేయూ అధ్యక్షుడు డి.ప్రతాప్ రెడ్డి, మారుతి, మల్లిరెడ్డి, శివ శంకర్, వెంకటస్వామి, లక్ష్మీనారాయణ, మంజు, మారెప్ప, ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### తలుపూరులో 'భూ సర్వే'



సర్వే రాళ్లు పాతిస్తున్న తహసీల్దార్ పరమేశ్వర స్వామి

**ఆత్మకూరు:** మండలంలోని తలుపూరు గ్రామంలో బుధవారం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తహసీల్దార్ పరమేశ్వర స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలుపూరు గ్రామంలో 7.50 ఎకరాల్లో సర్వే చేయడం జరిగిందన్నారు. వీటికి హద్దులు ఏర్పాటు చేసి, రాళ్ల పాతినట్లు తెలిపారు. ప్రభుత్వం భూములను సర్వే చేయడం ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

### పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు



పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా తీస్తున్న సెక్టార్ అధికారిణి సుచరిత

**ఆత్మకూరు:** త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఎన్నికల సెక్టార్ అధికారి సుచరిత తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంప్‌లు, కిటికీలు, తలుపులు, లైట్లు, మరుగుదొడ్ల తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

### ప్రవక్త మార్గం అనుసరణీయం



మేయర్ వసీం సలీంతో ఆధ్యాత్మికవేత్త ముఫ్తి షోయబుల్లా

**అనంతపురం కల్చరల్:** సమాజానికి ప్రవక్త సూచించిన మార్గం అనుసరణీయమని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ముఫ్తి షోయబుల్లా అన్నారు. బుధవారం రాత్రి స్థానిక కొవ్వూరు నగర్‌లోని నిమ్రామసీదులో బయాన్ కార్యక్రమం జరిగింది. ముఫ్తి షోయబుల్లా ముఖ్య అతిథిగా విచ్చేసి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. నేటి సమాజంలో పెరిగిపోతున్న అసమానతలు మాని అందరూ ఒక్కటై జీవించాలని ప్రబోధించారు. ఇతరులపై ద్వేషం, అసూయ ఉన్నవారు భగవంతుడి మెప్పించలేరన్నారు. ప్రేమ దయ, ధాతృత్వ భావాలను అందరూ పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేయర్ వసీం సలీం, వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు మెహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### మెడికల్ ఏజెన్సీలో చోరీ

**గుంతకల్లుటౌన్:** పట్టణంలోని మెయిన్‌రోడ్డు వైఎస్సార్ సర్కిల్‌లో ఉన్న షఫీ మెడికల్ ఏజెన్సీలో చోరీ జరిగింది. ఈ ఘటన బుధవారం ఉదయం వెలుగుచూసింది. గుర్తు తెలియని దుండగులు మెడికల్ ఏజెన్సీ దుకాణానికి వేసిన తాళం పగులగొట్టి షట్టర్‌ను తెరిచి రూ.50 వేల నగదు, ఫ్రిడ్జ్‌లో ఉంచిన ఇంజెక్షన్లు, మందులను అపహరించినట్లు ఏజెన్సీ నిర్వాహకుడు ఆబీద్ పోలీసులకు వివరించాడు. ఘటనా స్థలాన్ని వన్‌టౌన్ పోలీసులు పరిశీలించారు.

# వలంటీర్ల సేవలు అమూల్యం



రాప్తాడు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



చెన్నేకొత్తపల్లి: కార్యక్రమానికి హాజరైన వలంటీర్లు

• ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

**రాప్తాడు:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే తలమానికం. వలంటీర్లు ప్రతి కుటుంబానికి సంక్షేమ సారథులుగా సేవలందిస్తున్నారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా వ్యవహరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కీలకపాత్ర పోషిస్తున్న వలంటీర్లు మరింత ఉత్తమ సేవలందించాలని ఆకాంక్షించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మండలంలో ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవారత్న, సేవామిత్ర పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈనెల 18న నిర్వహించిన సిద్ధం సభ విజయవంతం కావడానికి ప్రతి వలంటీర్, కార్యకర్త అందరూ కూడా స్వచ్ఛంధంగా పని చేశారని కొనియాడారు. ప్రజలు కూడా సభకు స్వచ్ఛందంగా వచ్చి విజయవంతం చేశారని తెలిపారు. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చూపించి అమలు చేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థతో ప్రజల ముగింటికే పాలన తీసుకెళ్లారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ అందించాలనే ఉద్దేశంతో వలంటీర్ వ్యవస్థకు జగనన్న శ్రీకారం చుట్టారన్నారు. వలంటీర్లు పారదర్శకంగా అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం వారిని సత్కరించి, నగదు పురస్కారాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ వ్యవస్థను కించపరిచేలా ప్రతిపక్షాలు, పచ్చ మీడియా చేస్తోన్న దుష్ప్రచారానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వలంటీర్ వ్యవస్థ వెన్నెముక లాంటిందన్నారు. వీరి సేవలు ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా ఉండాలని సూచించారు. జగనన్న ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి రావడానికి పార్టీ శ్రేణులతో పాటు వలంటీర్లు కూడా తమంంతు సహకారం అందించాలని కోరారు. అనంతరం వంటీర్లకు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మేకల, గొర్రెల సహకార సొసైటీ చైర్మన్ పసుపుల నరసింహగౌడ్, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైస్ ఎంపీపీలు బోయ రామాంజనేయులు, మన్నల వరలక్ష్మి, మండల కన్వీనర్ జూటూరు శేఖర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

### సంక్షేమ వారధులు 'వలంటీర్లు'

**కనగానపల్లి(చెన్నేకొత్తపల్లి):** ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ చేరవేస్తున్న వలంటీర్లు సంక్షేమ వారధులని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. చెన్నేకొత్తపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంతో పాటు పేద ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చేశారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో చంద్రబాబు ప్రజలను మోసం చేస్తే, సీఎం వైఎస్ జగన్ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించారన్నారు. దీంతో వలంటీర్ల వ్యవస్థ దేశంలోనే ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన వలంటీర్లను సన్మానించి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జిగ అంజలీ, జెడ్పీటీసీ సభ్యుడు మెట్టు గోవిందురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నర్శిరెడ్డి, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి మద్దతుగా నిలవండి



40వ డివిజన్‌లో ఓ వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
• 40వ డివిజన్‌లో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

**అనంతపురం కార్పొరేషన్:** మంచి చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలిచి, మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సీఎంగా చేసుకుందామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని 40వ డివిజన్‌లోని రంగారెడ్డి కాలనీ, తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ ప్రాంతంలోని ప్రతి గడపకు వెళ్లిన ఎమ్మెల్యే.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, లబ్ధిదారులకు అందిన పథకాలను వివరించారు. సంక్షేమానికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించారు. భవిష్యత్తులో చేపట్టనున్న అభివృద్ధి పనులను తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఇంటి వద్దకే పాలన అందించిన జగనన్న ప్రభుత్వానికి మద్దతుగా ఉంటామని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

**టీడీపీతో ఒరిగిందేమీ లేదు..**

గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. అప్పటి పాలకుల వేరుకుంపట్లతో అభివృద్ధి అట్టడుగుకు చేరిందన్నారు. 2019 ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఉంటే పెద్ద ఎత్తున అభివృద్ధి చేసి తీరుతామని మాటిచ్చామన్నారు. ఇచ్చిన మాట కంటే అధికంగా సంక్షేమం, అభివృద్ధి చేసి చూపామన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో రూ.2,304 కోట్ల సంక్షేమం, రూ.1,045 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అమ్మ ఒడి రూ.93.39 కోట్లు, విద్యా దీవెన–వసతి దీవెన రూ.73.59 కోట్లు, వైఎస్సార్ చేయూత రూ.89.98 కోట్లు, వెస్సార్ ఆసరా రూ.77.36 కోట్లు, వైఎస్సార్ పింఛన్ కానుక రూ.403.98 కోట్లు, కాపు నేస్తం రూ.9.77 కోట్లు, ఈబీసీ నేస్తం రూ.11.78 కోట్లు, సున్నావడ్డీ రూ.16.98 కోట్లు, వైఎస్సార్ బీమా రూ.6.06 కోట్లు, సీఎం రిలీఫ్ ఫండ్ రూ.10.04 కోట్లు ఎస్సీ, ఎస్టీలకు ఫ్రీ కరెంటుకు రూ.5.27 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. రూ.311 కోట్లతో అర్బన్ లింక్ రోడ్డు, రూ.90 కోట్లతో గుత్తి రోడ్డు, ఎస్ క్యాప్ ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ.68.72 కోట్లు, నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.49.50 కోట్లు, రూ.19 కోట్లతో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సీఎం ప్రత్యేక నిధులు రూ.25 కోట్లు, రూ.41 కోట్లతో రుద్రంపేట పంచాయతీ, రూ.43 కోట్లతో ఏ నారాయణపురం, రూ.16 కోట్లతో రాజీవ్ కాలనీ, రూ.21 కోట్లతో అనంతపురం రూరల్ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు.

**సమస్యలు ఓపికగా వింటూ..**

ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమంలో కొందరు తెలిపిన సమస్యలను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఓపిగ్గా విన్నారు. సాంకేతిక లోపంతో జరిగిన జాప్యాన్ని సకాలంలో నివృత్తి చేసేలా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓ ట్రాన్స్‌జెండర్ పింఛన్ మంజూరుకు సంబంధించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పింఛన్ అందేలా చూస్తామని తెలిపారు. అనంతరం వలంటీర్లకు పలు సూచనలు, సలహాలనందజేశారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, కార్పొరేటర్లు అబూసలేహ, ఇసాక్, కమల్‌భూషణ్, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, స్థానిక నాయకులు షరీఫ్, నల్లప్ప, సందీప్ రాయల్, ఖాదర్‌బాషా, గుజ్జల లక్ష్మణ్, స్టోర్ డీలర్ ఇసాక్, డైరెక్టర్లు భూమిరెడ్డి జాహ్నవి, శ్రీనివాసులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు కొర్రపాడు హుస్సేన్‌పీరా, ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, నాయకులు రాధాకృష్ణ, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, రామయ్య, చింతకుంట మధు, జానీ, వనారస బలరాం, హనుమంతు, జావెద్, ఓబులేసు, పార్వతి, భారతి, శోభారాణి, ఉష, తదితరులు పాల్గొన్నారు.

**నేడు రాజీవ్ కాలనీలో..**

రాజీవ్ కాలనీ పంచాయితీలో గురువారం ఉదయం 7:30 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. రాజీవ్ కాలనీలోని రిక్షా కాలనీ మసీదు దగ్గర నుంచి కార్యక్రమం మొదలవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరుకావాలన్నారు.

# ఆర్టీసీని అభివృద్ధి పథంలో నడుపుదాం



బోర్డు మీటింగ్‌లో చర్చిస్తున్న జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, ఇతర అధికారులు

**అనంతపురం క్రైం:** ఆర్టీసీలో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేయాలని జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం విజయవాడలోని ఆర్టీసీ కేంద్ర కార్యాలయంలో బోర్డ్ మీటింగ్ జరిగింది. బోర్డు డైరెక్టర్లు, అధికారులతో కలిసి ఆర్టీసీ ప్రగతిపై చర్చించారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ.. నూతనంగా 1,489 కొత్త బస్సులు, ఏసీ స్లీపర్ బస్సులు, నాన్ ఏసీ స్లీపర్ బస్సులు, సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్‌తో పాటు అల్ట్రా డీలక్స్, పల్లె వెలుగు బస్సుల కొనుగోలుపై చర్చించారు. అధికారులు కొత్త బస్సులను మంజూరు చేసినట్లు వెల్లడించారు. కడప జోనల్‌లో పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులు ఏర్పాటు చేయడానికి నిర్ణయించామన్నారు. చనిపోయిన, మెడికల్ అన్‌ఫిట్ కాబడిన ఉద్యోగుల వారసులకు త్వరలో ఉద్యోగాలు ఇవ్వడానికి కూడా ఆమోదం తెలిపారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా హిందూపురం డిపో పరిధిలో నూతనంగా వైద్యశాల నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలోని గుత్తి డిపో వద్ద పాత బస్సు స్టేషన్ ప్రదేశంలో నూతనంగా బస్సు స్టేషన్ నిర్మిస్తామని తెలిపారు. అనంతలో ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయం పాత భవనం కావడంతో తిరిగి కొత్త కార్యాలయాన్ని నిర్మిస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏపీఎస్ ఆర్టీసీని విలీనం చేసి నాలుగేళ్లు అవుతోందని తెలిపారు. నాటి నుంచి నేటి దాకా ప్రభుత్వం పదహైదు వేల కోట్ల రూపాయలను ఉద్యోగస్తుల జీత, భత్యాల రూపంలో చెల్లించిందన్నారు. నాటి పాలకుల నిర్ణయాలతో ఆర్టీసీ కుదేలైనట్లు పేర్కొన్నారు. 2016 నుంచి చనిపోయిన ఉద్యోగస్తుల పిల్లలకు మాత్రమే కాకుండా అంతకుముందు కూడా ఉన్న వారి పిల్లలకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇవ్వాలని చీఫ్ సెక్రెటరీని కోరామన్నారు. జిల్లాకు అత్యధికంగా నూతన బస్సులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. కొత్త రూట్‌లకు బస్సులను పెంచాలని వివరించినట్లు వెల్లడించారు. పల్లె వెలుగు బస్సులు జిల్లాలోని అవసరమైన అన్ని రూట్లలో నడపాలని, స్కూల్ బస్సుల సంఖ్యను పెంచాలని బోర్డు సభ్యులతో పాటు అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

# జోరుగా ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ కార్డులు అందజేసిన కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్ గురుశేఖర్ బాబు

**అనంతపురం కార్పొరేషన్:** పేద, సామాన్య మధ్య తరగతి ప్రజలకు ఖరీదైన వైద్యాన్ని అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సర్కార్ ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచింది. అనంతపురం అర్బన్‌లోని 74 సచివాలయాల పరిధిలో నూతన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ ప్రక్రియ వేగవంతం అవుతోంది. కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో 50 డివిజన్లలో ఇప్పటికే 21 వేల మందికి పైగా లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. మొదటి దశలో 12,800, రెండో దశలో 8000 మందికి పంపిణీ చేశారు. రానున్న రోజుల్లో మిగితా వారికి కార్డులు పంపిణీ చేయనున్నారు.

**అర్హులందరికీ కార్డుల పంపిణీ**

కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అర్హులందరికీ ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని 50వ డివిజన్ 72వ సచివాలయ పరిధిలోని ప్రజలకు స్థానిక కార్పొరేటర్ గురుశేఖర్ బాబుతో కలసి ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేశారు. మిగిలిన వారికి త్వరలోనే కార్డులను పంపిణీ చేస్తామన్నారు. మరికొంత మందికి కార్డులు రానున్నాయని తెలిపారు.

# తెలుగు భాషను ప్రేమిద్దాం



నినాదాలు చేస్తున్న కవులు, రచయితలు



మాట్లాడుతున్న శ్యాంసుందరశాస్త్రి

**అనంతపురం కల్చరల్:** తెలుగు భాషను ప్రేమిద్దాం.. పరభాషలను గౌరవిద్దామని పలువురు రచయితలు, కవులు పిలుపునిచ్చారు. బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలుగు భాషా వికాస ఉద్యమ సంస్థ, డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి సంయుక్త ఆధ్వర్యంలో తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వికాస ఉద్యమ సారథి శ్యామసుందర శాస్త్రి నేతృత్వంలో భాషకు సేవలందిస్తున్న కవులు రియాజుద్దీన్, రసూల్, ఓబిరెడ్డి, ఫిరోజ తదితరులను సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలుగు జాతి గొప్పతనాన్ని చాటే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ విద్యార్థుల్లో భాషాభిమానం పెంచుతామన్నారు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాల విద్యార్థులు అధిక సంఖ్యలో తరలి వచ్చి తెలుగు తల్లి విగ్రహం వద్ద నినాదాలు చేశారు. సీనియర్ గాయకుడు కేవీ మహీధర్ ఆలపించిన 'కమ్మనైన తెలుగు భాష కలనైనా మరవద్దు' వికాస ఉద్యమ గీతం ఆకట్టుకుంది. అలాగే తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు బి.నారాయణ నేతృత్వంలో తెలుగుతల్లి విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించారు.

**అనంతపురం ఎడ్యుకేషన్:** తెలుగు భాషకు సంగీత శ్రావ్యత ఉంది. నికోలోకాంటి వంటి విదేశీ యాత్రికులు ప్రశంసలు కురిపించిన భాష తెలుగు అని సీనియర్ రచయిత జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి పేర్కొన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరుపుకున్నారు. శ్యామసుందర శాస్త్రి మాట్లాడుతూ.. తెలుగు భాషకు మూడు వేల సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. హాల్డేన్ వంటి జంతు శాస్త్రవేత్తలు భారతీయ భాషల్లో జాతీయ భాషగా చేయదగిన అర్హత ఒక్క తెలుగు భాషకు మాత్రమే ఉందని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కళాశాల తెలుగు విభాగం అధ్యక్షుడు డాక్టర్ పి.విజయ కుమార్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణ దేవరాయల చేత గౌరవాన్ని పొందిన భాష తెలుగు అని కొనియాడారు. తెలుగు అధ్యాపకులు డాక్టర్ హేమమాలిని భాష ఔన్నత్యాన్ని వివరించారు. సంస్కృత అధ్యాపకులు సుధామ వంశీ తెలుగు భాషకు ఇతర భాషలతో ఉన్న సంబంధాన్ని తెలిపారు. పద్య పఠనంలో విజేతలకు ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు అంకే శ్రీనివాస్, అంకే మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.


### ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



ఎగ్జామినేషన్ కిట్లు పంపిణీ చేస్తున్న విశ్రాంత బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రామాంజనేయులు

**రాప్తాడు:** విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని విశ్రాంత బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అంబారపు రామాంజనేయులు అన్నారు. బుధవారం ఎన్‌కేసీ సేవా సమితి ఆధ్వర్యంలో ధర్మవరం పంగల్ రోడ్డులోని కేజీబీవీ పాఠశాలలో 101 మంది విద్యార్థులకు ఎగ్జామినేషన్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు సాధిస్తారని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్‌లో విద్యార్థులు 100 శాతం ఫలితాలు సాధించాలని కోరారు. వంద శాతం ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. ఎస్‌కేసీ సేవా సమితి వ్యవస్థాపకులు ఎస్.కమల్‌నాథ్ మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పరీక్షల సమయంలో ఎగ్జామినేషన్ కిట్స్ ప్రతి ఏటా పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ ముత్యాలమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### కల్వర్టు పనుల పరిశీలన



కల్వర్టును పరిశీలిస్తున్న ఎంపీడీఓ పుల్లయ్య

**రాప్తాడురూరల్:** అనంతపురం రూరల్ మండలం కొడిమి గ్రామ పంచాయతీ పరిధిలో మండల పరిషత్ సాధారణ నిధులు రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, కల్వర్టులను బుధవారం ఎంపీడీఓ పుల్లయ్య పరిశీలించారు. జ్యోతిబసు కాలనీ, ఆటోకాలనీల్లో పర్యటించి పనుల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈశ్వరయ్య పాల్గొన్నారు.

# మానసిక ఒత్తిడికి గురికావొద్దు



మాట్లాడుతున్న ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ వెంకటరమణ నాయక్

**అనంతపురం ఎడ్యుకేషన్:** ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఒత్తిడి ఉండటం సహజం. అలాగని అనవసరమైన మానసిక ఒత్తిడి పెట్టుకోకూడదని ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ వెంకటరమణ నాయక్ సూచించారు. ఇంటర్ విద్యార్థులలో 'ఒత్తిడి, ఆత్మహత్యల నివారణ'కు తీసుకోవాల్సిన చర్యల్లో భాగంగా బుధవారం అనంతపురం రూరల్ మండలం ఆలమూరు రోడ్డులోని సత్యసాయి జూనియర్ కళాశాల, ఎస్ఆర్ జూనియర్ కళాశాల్లో 138 ప్రభుత్వ, ఎయిడెడ్, కేజీబీవీ, మోడల్, ప్రైవేటు జూనియర్ కళాశాలల కౌన్సిలర్లకు ఒక్కరోజు శిక్షణ తరగతులను వర్చువల్‌గా నిర్వహించారు. పరీక్షలు సమీపిస్తున్న విద్యార్థుల మానసిక ఒత్తిడి, పరీక్షల్లో ఫెయిలైతే ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలపై అప్రమత్తం చేయడంలో భాగంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నారు. కళాశాల స్థాయిలో శిక్షణ ఇచ్చే కౌన్సిలర్లకు వర్క్‌షాపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణనాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఒత్తిడిని జయించేందుకు తీసుకోవాల్సిన చర్యలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డీఈసీ మెంబర్లు శంకరయ్య, షఫీ తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి కల్పనకు ఉచిత శిక్షణ

**తాడిపత్రి అర్బన్:** ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సౌజన్యంతో ఏకో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పన కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ సెక్రటరీ కె.ఉస్మాన్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జనరల్ డ్యూటీ అసిస్టెంట్ నర్సింగ్ కోర్సు, టైలరింగ్ కోర్సులకు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం ప్రభుత్వ సర్టిఫికెట్ ఇచ్చి ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. జనరల్ డ్యూటీ అసిస్టెంట్ నర్సింగ్ కోర్సుకు 10వ తరగతి ఉత్తీర్ణత అంత కంటే ఎక్కువ చదివిన అమ్మాయిలు అర్హులన్నారు. టైలరింగ్ కోర్సుకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. మరిన్ని వివరాల కోసం 8328132288, 9440107686 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

### జూదరుల అరెస్టు

**యాడికి:** మండలంలోని కమలపాడు గ్రామంలో పేకాట స్థావరంపై దాడి చేసి ఎనిమది మందిని అరెస్టు చేశామని సీఐ నాగార్జున రెడ్డి బుధవారం తెలిపారు. వారి నుంచి రూ.8,800 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.



### పాఠశాలకు విరాళం

**ఆత్మకూరు:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993–94 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు బుధవారం పాఠశాల పేరు మీద రూ.లక్ష నగదును బ్యాంక్‌లో డిపాజిట్ చేశారు. తాము చదివిన పాఠశాలకు ఏదైనా మంచి చేయాలన్న ఉద్దేశంతో రూ.లక్ష విరాళంగా సేకరించినట్లు పూర్వ విద్యార్థులు రామాంజనేయులు, ప్రసాద్, వినోద్‌రెడ్డి, నాగరాజు, మున్నెమ్మ, మాధవి, రాధా, ఖాజాహుసేన్, సరళ, పుష్పలత, ఇమాంబి, చాంద్‌బాషా, వాణి, రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ నగదుపై వచ్చే వడ్డీతో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేయాలని పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులును కోరారు.

### నేడు ఎమ్మెల్యే పర్యటన

**రామగిరి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ కత్రా హనుమంతరెడ్డి బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

**వలంటీర్లకు సన్మానం**

**కనగానపల్లి:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం వలంటీర్లను సన్మానించనున్నట్లు మండల కన్వీనర్ అమరనాథరెడ్డి బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.